

ఇంకా వరదనీటిలోనే వేలూరులోని కొన్ని వీధులు

బలపడిన అల్పపీడనం

● వాయుగుండంగా రూపాంతరం



తంజావూరులో దెబ్బతిన్న ధాన్యం వద్ద రైతులు

● దక్షిణాది జిల్లాలను వీడని వర్షం ● సహాయక చర్యల్లో యంత్రాంగం

చెన్నై, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారింది. దీంతో రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం ఈ అల్పపీడనం ఉత్తర తమిళనాడుకు సమీపంలో కేంద్రీకృతమైవుంది. ఇది క్రమంగా పశ్చిమ దిశగా ప్రయాణించి కర్ణాటక వైపు వెళ్తుందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఇదిలావుండగా శుక్రవారం బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది.

వంద గృహాల్లోకి డ్రైనేజీ నీరు

స్థానిక మీంజూరు పట్టణ పంచాయతీ పరిధిలోని వంద గృహాల్లోకి డ్రైనేజీ నీరు ప్రవేశించింది. దీంతో ఆయా ప్రాంతాల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విధంగా మీంజూరుకు సమీపంలోని నందియంబాక్కం గ్రామంలో కూడా వర్షపునీరు భారీగా చేరింది. ఈ గ్రామంలో వర్షపునీటి కాల్వలను ఆక్రమించుకుని పక్కా భవనాలు నిర్మించడంతో వర్షపునీరు వెళ్ళేందుకు వీలులేకుండా పోయింది. అదేవిధంగా పొన్నేరి ఎన్‌జీవో నగర్, కన్నదాసన్ వీధి తదితర ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ కోసం తవ్విన గుంతల్లోకి వర్షపునీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

డ్రైనేజీ నీటిని తక్షణం తొలగించాలి: మేయర్ ఆదేశం

నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ నీరు నిలిచివున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ తరహా ఫిర్యాదులపై కార్పొరేషన్ సిబ్బంది తక్షణం స్పందించి డ్రైనేజీ నీటిని తొలగించాలని చెన్నై మేయర్ ఆర్.ప్రియ ఆదేశించారు. గురువారం తిరువిక నగర్ ప్రాంతంల్లో 71వ వార్డు పరిధిలోని అరుంధతియార్ నగర్‌లోని ప్రతి వీధికి వెళ్ళి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో వెయ్యి కుటుంబాలు 50 యేళ్ళకుపైగా నివసిస్తున్నారన్నారు. ఈ ప్రాంతంలో డ్రైనేజీ సమస్య అధికంగా ఉందన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఈ సమస్య తీవ్రత అధికంగా ఉందన్నారు. ఈ సమస్యను పరిష్కరానికి అధికారులు చర్యలు చేపట్టారన్నారు. అలాగే, నగరంలోని రోడ్లు, వీధుల్లో నిలిచివున్న డ్రైనేజీ నీటిని తక్షణం తొలగించాలని అధికారులను ఆదేశించినట్టు వెల్లడించారు.

అండ వ నా న్

తీరంలో అవరించిన ఉపరితల ద్రోణి ప్రభావంతో ఆగ్నేయ బంగాళాఖాతం, దానిని ఆనుకునివున్న ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడివున్నట్టు తెలిపింది. ఈ కారణంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఇదిలావుంటే గురువారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదైంది. ఆరూర్‌లో 100 మిల్లీమీటర్లు, రాణిపేటలో 75మి.మీ, తిరుచ్చిలో 72మి.మీ, తిరుచ్చి ఎయిర్‌పోర్టు సమీపంలో 40 మి.మీ, చెన్నై విమానాశ్రయం ప్రాంతంలో 20 మి.మీ, తిరువణ్ణామలైలో 21 మి.మీ, మదురైలో 17 మి.మీ, తిరనింద్రయూరులో 14 మి.మీ, పెరంబలూరులో 10 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

1436 మోటార్ పంపులు సిద్ధం

భారీ వర్ష ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టేందుకు అన్ని రకాల యంత్రసామగ్రితో సిద్ధంగా ఉన్నట్టు ప్రభుత్వం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీటిని తొలగించేందుకు 1436 పంపుసెట్లు, 298 వాహనాలను సిద్ధంగా ఉంచామని వెల్లడించింది. ఈ వర్షాకాలంలో చెన్నై మహానగరంలోని 22 సబ్‌వేల్లో వర్షపునీటిని తొలగించేందుకు పంపు సెట్లను సిద్ధంగా ఉంచినట్టు తెలిపింది. గురువారం ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నగరంలో సరాసరిగా 4.66 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గరిష్ఠంగా మేడవాక్కం ప్రాంతంలో 18.30 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీటిని పంపింగ్ చేసేందుకు వీలుగా 1436 మోటార్ పంపుసెట్లు, 150 హెచ్‌పీ మోటార్లు, ట్రాక్టర్లపై అమర్చే 500 మోటార్లను సిద్ధంగా ఉంచినట్టు తెలిపింది. అలాగే, గురువారం వర్ష బాధిత ప్రాంతాల్లో 1,48,450 మందికి అల్పాహారం, 76 వంటశాలల్లో తయారు చేసిన భోజన ప్యాకెట్లను 2,20,950 మందికి అందజేసినట్టు ప్రభుత్వం పేర్కొంది.

నిండిన 79 చెరువులు

వర్షాల కారణంగా తిరువళ్ళూరు జిల్లాలో 79 చెరువులు పూర్తిగా నిండాయి. ఈ జిల్లాలో మొత్తం 1175 చెరువులుండగా, వీటిలో 79 చెరువులు పూర్తిగా నీటితో నిండాయి. ఈ జిల్లాలో గరిష్ఠంగా తిరుత్తణిలో 7.8 సెంటీమీటర్లు, తిరువలంగాడులో 6.7 సెంమీ చొప్పున వర్షపాతం నమోదైంది.

1.46 లక్షల ఎకరాల్లో మునిగిన పంట

కావేరీ డెల్టా జిల్లాల్లో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా 1.45 లక్షల ఎకరాల్లో వరి నీట మునిగింది. దీంతో తమను ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. పలు డెల్టా జిల్లాల్లో బుధవారం రాత్రి కూడా విస్తారంగా వర్షం కురిసింది.

పరిశీలనకు కేంద్ర బృందం!

భారీవర్షాల కారణంగా దెబ్బతిన్న పంటనష్టం వివరాల సేకరణకు కేంద్ర బృందం ఏర్పాటైంది. పలు జిల్లాల్లో చేతికి అందాల్సిన వరి నీటిలో మునిగి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఈ కారణంగా, వరి తేమ శాతం 17 నుంచి 22 శాతానికి పెంచి కొనుగోలు చేయాలని కేంద్ర ఆహార శాఖ అధికారులకుకు, రాష్ట్ర ఆహార శాఖ లేఖ రాసింది. ఆ ప్రకారం, 9 మందితో కూడిన కేంద్ర బృందం త్వరలో రాష్ట్రంలో పర్యటించనున్నట్లు సమాచారం. ఈ బృందం మూడు బృందాలుగా ఏర్పడి బాధిత జిల్లాల్లో దెబ్బతిన్న వరి పంటను పరిశీలించి, కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందజేయనుందని రాష్ట్ర అధికారులు తెలిపారు.



కొళత్తూరులో దెబ్బతిన్న రోడ్డు

మరణంలోనూ వీడని 'స్నేహం'

● రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి ● తట్టుకోలేక స్నేహితుడి బలవన్మరణం



వీరకుమార్, ధనశేఖర్ (ఫైల్ ఫొటోలు)

చెన్నై, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మరణం కూడా వారి స్నేహాన్ని విడదీయలేకపోయింది. రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మరణించగా, ఆ విషయం తెలిసి అతని స్నేహితుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. తిరుప్పూర్ జిల్లాలో గురువారం జరిగిన ఈఘటనకు సంబంధించి వివరాలిలా... మనకడవు గ్రామానికి చెందిన కార్మికుడు కార్తికేయన్ కుమారుడు వీరకుమార్ (18) ఇటీవలే ఉద్యోగంలో చేరాడు. అదే గ్రామానికి చెందిన అతడి స్నేహితుడు ధనశేఖర్ (18) పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. మంగళవారం కొత్తగా బైక్ కొన్న వీరకుమార్ ధనశేఖర్‌తో కలసి తారాపురంలోని ఆలయానికి వెళ్ళి పూజలు చేశాడు. అనంతరం వారు బైక్‌పై స్వగ్రామానికి తిరిగి వస్తుండగా రాత్రి 7 గంటల సమయంలో తారాపురం-పళని రోడ్డులో వీరి బైక్‌ను, వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరూ కిందపడగా, వీరకుమార్ తలకు బలమైన గాయమైంది. చుట్టుపక్కల వారు వీరకుమార్‌ను తారాపురం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే మృతిచెందాడు. స్నేహితుడి మృతి తట్టుకోలేని ధనశేఖర్.. తన ఇంటికెళ్లి అర్ధరాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

కరూర్ ఘటన న్యాయస్థానంలో సీబీఐ నివేదిక

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కరూర్‌లో సంభవించిన తొక్కిసలాటపై విచారణ చేపట్టిన సీబీఐ గురువారం ఉదయం తొలిసారిగా కరూర్ న్యాయస్థానంలో నివేదిక దాఖలుచేసింది. కరూర్ వేలుచామిపురంలో గత నెల 27న టీవీకే అధ్యక్షుడు విజయ్ ప్రచార సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారానికి సంబంధించి సుప్రీంకోర్టు, ఏక సభ్య కమిషన్, ప్రత్యేక విచారణ కమిటీలను రద్దు చేసి సీబీఐ విచారణకు ఆదేశించింది. ఈ ఉత్తర్వులతో, గుజరాత్‌కు చెందిన ఎస్పీ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో అదనపు పోలీసు సూపరింటెండెంట్ ముఖేష్‌కుమార్, అసిస్టెంట్ పోలీసు సూపరింటెండెంట్ రామకృష్ణన్‌లతో కూడిన సీబీఐ బృందం ఈ నెల 15వ తేదీన కరూర్ చేరుకుంది. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని గెస్ట్ హౌస్‌లో బసచేసి విచారణ చేపట్టింది. ఐజీ ఆస్రా గార్గ్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం, సుప్రీంకోర్టు ఉత్తర్వులతో కేసుకు సంబంధించిన పత్రాలు, విచారణ నివేదికను సీబీఐ బృందానికి అప్పగించింది.మరుసటిరోజ సీబీఐ బృందం, వేలుచామిపురంలో దర్యాప్తు చేపట్టింది.ఈ క్రమంలో గురువారం విచారణ ప్రారంభించిన సీబీఐ బృందం, మృతుల కుటుంబ సభ్యులు, గాయపడిన వారు, పోలీసు అధికారులు, అంబులెన్స్ డ్రైవర్లు పలువురిని విచారించింది. అదే సమయంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ విజయ్ రస్తోగి నేతృత్వంలోని మరో బృందం విచారణ పర్యవేక్షించేలా సుప్రీంకోర్టు నియమించింది. ఈ బృందం శుక్రవారం కరూర్‌కు చేరుకుని సీబీఐ దర్యాప్తును పరిశీలించనున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో, ఎస్పీ ప్రవీణ్ కుమార్ నేతృత్వంలోని సీబీఐ బృందం, ఎనిమిది రోజుల విచారణ నివేదికను కరూర్ క్రిమినల్ సెషన్స్ కోర్టు నెం-1లో న్యాయమూర్తి భరత్ కుమార్ ముందు దాఖలుచేశారు.

సేందమంగళం ఎమ్మెల్యే కన్నుమూత



పొన్నుస్వామి మృతదేహానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం ఉదయనిధి



పొన్నుస్వామి (ఫైల్ ఫొటో)

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లా సేందమంగళం డీఎంకే ఎమ్మెల్యే కె.పొన్నుస్వామి (72) అనారోగ్యం కారణంగా గురువారం ఉదయం మృతిచెందారు. సేందమంగళం నియోజవర్గం (ఎస్టీ రిజర్వ్‌డ్) ఎమ్మెల్యే పొన్నుస్వామి రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురవడంతో బుధవారం ఉదయం నామక్కల్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స ఫలించక గురువారం ఆయన మృతిచెందారు. కుళందైవేల్-వెల్లైయమ్మాళ్ దం పతులకు 1954లో జన్మించిన పొన్నుస్వామికి జయమణి అనే భార్య, మాదేష్ అనే కుమారుడు, పూమలర్ అనే కుమార్తె ఉన్నారు. కొల్లిమలైలోని లక్కిరాయపట్టికి చెందిన పొన్నుస్వామి, 9వ తరగతి వరకు చదివి, వ్యవసాయం చేస్తున్నారు. 2003 నుంచి డీఎంకే సభ్యుడిగా కొనసాగిన ఆయన, 2006 అసెంబ్లీ ఎన్నికల్లో సేందమంగళం నియోజకవర్గం నుంచి పోటీచేసి విజయం సాధించారు. 2011, 2016 సంవత్సరాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే అభ్యర్థిగా పోటీచేసి పరాజయం చవిచూశారు. మళ్లీ 2021లో పోటీచేసి విజయం సాధించారు. కొల్లిమలై పర్యాటక కేంద్రంగా, ప్రత్యేక తాలూకాగా మార్చేందుకు పొన్నుస్వామి కృషి చేశారు. పొన్నుస్వామి మృతదేహానికి ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే, రాజ్యసభ సభ్యుడు కేఆర్‌ఎన్ రాజేష్‌కుమార్, జిల్లా కలెక్టర్ దుర్గామూర్తి, ఎస్పీ విమల, ఎమ్మెల్యే రామలింగం సహా డీఎంకే, కూటమి పార్టీల నేతలు పొన్నుస్వామి మృతదేహానికి నివాళులర్పించారు.

సీఎం సంతాపం...

సేందమంగళం ఎమ్మెల్యే పొన్నుస్వామి మృతి పట్ల ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షులు ఎంకే స్టాలిన్ సంతాపం తెలిపారు. "సేందమంగళం ఎమ్మెల్యే పొన్నుస్వామి మరణ వార్త విని నేను చాలా బాధపడ్డాను. సేందమంగళం నియోజకవర్గ ప్రజల్లో గౌరవాన్ని సంపాదించుకుని, శాసనసభలో రెండు సార్లు వారి ప్రతినిధిగా సేవ చేసిన ఆయన మరణం, ఆ నియోజకవర్గ ప్రజలకు, డీఎంకే పార్టీకి తీరనిలోటు. పార్టీ పట్ల విశ్వాసంతో, కలైంజర్ కరుణానిధి పట్ల అపారమైన ప్రేమతో పనిచేశారు. గిరిజనుల పురోగతికి అవిశ్రాంతంగా కృషి చేశారు. ఆయన మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఆయన మృతితో వేదనలో ఉన్న నియోజకవర్గ ప్రజలు, ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, డీఎంకే కార్యకర్తలకు సంతాపం తెలియజేస్తున్నాను' అంటూ సీఎం సంతాప సందేశంలో తెలిపారు.

మళ్లీ రాష్ట్ర పర్యటనకు విజయ్

● వచ్చే వారం నుంచి ప్రారంభం ? ● రోడ్‌షోలకు స్వస్తి.. మైదానాల్లోనే సభలు!

అడయార్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధ్యక్షుడు విజయ్ మళ్ళీ రాష్ట్ర పర్యటనకు శ్రీకారం చుట్టనున్నారు. వచ్చే వారం పర్యటన ప్రారంభించాలని విజయ్ భావిస్తున్నారు. ఈ విషయంపై ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్‌తో పాటు పార్టీ సీనియర్ నేతలతో ఆయన సమాలోచన చేస్తున్నట్టు టీవీకే వర్గాలు పేర్కొంటున్నాయి. గత నెల 27వ తేదీన విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార సభలో తొక్కిసలాట జరిగి 41 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఆయన రాష్ట్ర పర్యటన నిలిపివేశారు. ఈ నేపథ్యంలో తాను నిలిపివేసిన పర్యటన మళ్ళీ ప్రారంభించేందుకు విజయ్ సిద్ధమవుతున్నారు. ఈ పర్యటనకు సంబంధించిన అధికారిక షెడ్యూల్ ఒకటి రెండు రోజుల్లో వెల్లడికావచ్చని భావిస్తున్నారు. ఈ పర్యటన సమయంలో ప్రజల భద్రతపై అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పార్టీ నేతలకు విజయ్ స్పష్టమైన ఆదేశాలిచ్చినట్టు సమాచారం. ముఖ్యంగా రోడ్‌షోలకు దూరంగా ఉండాలని భావిస్తున్నారు.ఇకపై విశాలమైన మైదానాల్లోనే సభలు నిర్వహించాలని విజయ్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. చెన్నై నుంచి ఆయా సభా ప్రాంగణాలకు హెలికాప్టర్‌లో వెళ్లాలని ఆయన భావిస్తున్నట్టు తెలిసింది. ఇందుకోసం బెంగళూరుకు చెందిన సంస్థతో ఒప్పందం కూడా కుదుర్చుకున్నారని టీవీకే వర్గాలు తెలిపాయి. ప్రజల రద్దీ, వాహన రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా తన ప్రచారాన్ని కొనసాగించేలా టీవీకే పక్కా ప్రణాళికను ఖరారు చేస్తున్నట్టు తెలిసింది.



విజయ్‌కి స్వాగతం

● బీజేపీ అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఆహ్వానం



ప్యారీస్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తమ కూటమిలోకి 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధినేత విజయ్ వస్తే ఘనంగా స్వాగతిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్ పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీపీ రాధాకృష్ణన్ ఈ నెల 28న కోవైలో పర్యటించి కొడిసియాలో నిర్వహించనున్న పారిశ్రామికవేత్తల మహానాడులో పాల్గొననున్నారు. ఉపరాష్ట్రపతికి కోవై విమానాశ్రయంలో రాష్ట్ర బీజేపీ తరపున నాగేంద్రన్ ఘన స్వాగతం పలుకనున్నారు. ఆయన పర్యటన ఏర్పాట్లను పరిశీలించేందుకు నయినార్ నాగేంద్రన్ గురువారం కోవై వెళ్లారు. ఈ సందర్భంగా విలేఖరులు అడిగిన వివిధ ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. డెల్టాలో సుమారు 12లక్షల హెక్టార్ల భూములు నీటమునిగాయని, ఈ జిల్లాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాలు వానలో తడిస్తున్నాయని, అయినా రాష్ట్రప్రభుత్వం దీనిపై స్పందించకపోవడ దారుణమన్నారు. ఈశాన్యాన్ని ఎదుర్కొనేందుకు వర్షానికి ముందే కేంద్రప్రభుత్వం తమిళనాడు ప్రభుత్వానికి రూ.250కోట్లను విడుదల చేసిందని తెలిపారు.

ధాన్యం కొనుగోలుపై శ్వేతపత్రం....

ధాన్యం కొనుగోలుపై రాష్ట్రప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని నాగేంద్రన్ డిమాండ్ చేశారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాలు నిల్వవుండటానికి కారణం కేంద్ర ప్రభుత్వమేనని రాష్ట్ర ఆహారశాఖ మంత్రి చక్రపాణి ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. 2025-26వ ఆర్థిక సంవత్సరంలో రైతుల నుండి కొనుగోలు చేస్తున్న ధాన్యంతో నాణ్యమైన బియ్యం కలిపేందుకు అవసరమైన మార్గదర్శకాలను కేంద్రప్రభుత్వం జూలై 28వ తేదీనే రాష్ట్రప్రభుత్వానికి పంపించిందని, అయితే మంత్రి చక్రపాణి వాస్తవాలను మరుగుపరిచి రైతులను మభ్యపెట్టేందుకు కేంద్రప్రభుత్వంపై బురదచల్లేలా వ్యాఖ్యానించారని ఆయన తెలిపారు.

వరదలపై మాట్లాడే అర్హత ఎడప్పాడికి లేదు

● మంత్రి పీకే శేఖర్ బాబు



దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తున్న మంత్రి శేఖర్‌బాబు

అడయార్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వరద సహాయక చర్యలపై మాట్లాడే అర్హత ఆన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామికి ఏమాత్రం లేదని దేవాదాయశాఖ మంత్రి పీకే శేఖర్ బాబు ఎద్దేవా చేశారు. ఈశాన్య రుతుపవనాల ప్రభావం కారణంగా నగరంలో వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో కోయంబేడు హోల్‌సేల్ మార్కెట్‌లో చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై ఆయన గురువారం సమీక్ష చేశారు. ఆ తర్వాత పెరంబూరులోని 71వ వార్డు జమాలియా పరిధిలోని అరుంధతియార్ నగర్‌లో డ్రైనేజీ పొంగే ప్రాంతాన్ని పరిశీలించి తక్షణం మురుగు తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కోయంబేడు మార్కెట్‌కు ప్రతిరోజూ లక్షకు పైగా వాహనాలు వస్తాయన్నారు. అందువల్ల ఈ మార్కెట్‌లో వర్షపునీరు నిల్వకుండా, మార్కెట్ ప్రాంతంలో రహదారుల అభివృద్ధికి రూ.40 కోట్ల వ్యయంలో వర్షపునీటి కాల్వల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. ఈ పనులు 70 శాతం పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. తిరువిక నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని నిర్మించిన కార్పొరేషన్ పాఠశాల ప్రారంభోత్సవం శుక్రవారం జరుగుతుందని మంత్రి వెల్లడించారు.



తాంబరం కార్పొరేషన్ పరిధిలోని మేడవాక్కం పంచాయతి మాజీ చైర్మన్, చిట్లపాక్కం యూనియన్ కౌన్సిలర్ పి.రవి అనారోగ్యం కారణంగా మృతిచెందగా, గురువారం ఆయన భౌతికయానికి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ (చిత్రంలో) మంత్రులు దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, ఎం.సుబ్రమణ్యం, ఎంపీలు జగద్రక్షకన్, తమిళచ్చి తంగపాండియన్, ఎమ్మెల్యేలు కె.పొన్ముడి, అరవింద్ రమేష్, తాంబరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కామరాజ్ తదితరులు

సమాచార ధ్వని

29 నుంచి తెన్‌కాశి జిల్లాలో సీఎం పర్యటన

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29, 30 తేదీల్లో తెన్‌కాశి జిల్లాలో ముఖ్యమంత్రి స్టాలిన్ పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్, అన్ని జిల్లాల్లో పర్యటిస్తూ ప్రభుత్వ పథకాల అమ లు తీరు, జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పథకాలు ప్రారంభోత్సవం, కొత్త పథకాలకు శంకుస్థాపన, వివిధ శాఖల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు సంక్షేమ సహాయాల పంపిణీ చేపడుతున్నారు. అలాగే, జిల్లా అభివృద్ధిపై అధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నారు.

రేపు, 25న రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ముహూర్తపు రోజుల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు అందించనున్న రిజిస్ట్రేషన్ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, ఐపసి నెల ముహూర్తపు రోజులైన శుక్రవారం, 27వ తేది అదనపు టోకెన్లు అందించనున్నారు. ఆ ప్రకారం, ఒక రిజిస్ట్రార్ పనిచేస్తున్న కార్యాలయాల్లో అందిస్తున్న వంద టోకెన్లకు బదులు 150, ఇద్దరు రిజిస్ట్రార్లు పనిచేస్తున్న కార్యాలయాల్లో అందిస్తున్న 200 టోకెన్లకు బదులు 300 టోకెన్లు అందించనున్నట్లు రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ దినేష్ పొన్‌రాజ్ తెలిపారు.

మహిళా ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని మహిళా ఐటీఐలో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థినులు ఈ నెల 31వ తేదిలోగా దరఖాస్తులు సమర్పించాలి. ఈ మేరకు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్థ్ విడుదల చేసిన ప్రకటనలో... గిండి మహిళా ఐటీఐలో ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ కోర్సుల్లో అడ్మిషన్లు చేపట్టామన్నారు. అడ్మిషన్లు పొందిన విద్యార్థుల నుంచి ఎలాంటి ఫీజు వసూలుచేయరు. అలాగే, సైకిల్, విద్యా సామగ్రి ఉచితంగా అందజేయడంతో పాటు నెలకు రూ.750 భృతి అందజేయనున్నారు. 8వ తరగతి పాస్, 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన విద్యార్థులు, మార్కుల జాబితా, కుల, ఆదాయ ధృవీకరణ సర్టిఫికేట్లు, ఐదు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్ కార్డుతో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు 044-22510001, 9499055651 అనే నెంబర్లు సంప్రదించవచ్చని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

30న పోస్టల్ గ్రీవెన్స్

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తాంబరం పోస్టల్ డివిజన్ పరిధిలో ఈ నెల 30వ తేది తపాలా గ్రీవెన్స్ జరుగనుంది. ఈ మేరకు తాంబరం పోస్టల్ డివిజన్ సీనియర్ తపాల అధికారి ఎ.కమల్ భాషా విడుదల చేసిన ప్రకటనలో... తపాలా శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఈ నెల 27 నుంచి నవంబరు 2వ తేది వరకు అవగాహన వారోత్సవాలు నిర్వహించనున్నామన్నారు. అందులో భాగంగా తాంబరం పరిధిలో ఈ నెల 30వ తేది ఉదయం 11 గంటలకు గ్రీవెన్స్ నిర్వహించనున్నామని తెలిపారు. వినియోగదారులు తమ సమస్యలను dotambaram.tn@indiapost.gov.tn అనే ఈ-మెయిల్, తాంబరం సీనియర్ తపాలా అధికారి కార్యాలయానికి ఈ నెల 27వ తేదిలోపు పంపించాలన్నారు. సమస్యలతో కూడిన కవర్లు, ఈ-మెయిల్‌లో Special Grievance Redressal Camp అని తప్పనిసరిగా రాయాలని తపాలాధికారి తెలిపారు.

హోంగార్డ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ పరిధిలోని హోంగార్డ్ విభాగంలో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు నగర పోలీసు శాఖ విడుదల చేసిన ప్రకటనలో... చెన్నై కార్పొరేషన్ పరిధికి చెంది, ఈ నెల 1వ తేది నాటికి 18 ఏళ్ల పూర్తయి, 50 ఏళ్లలోపున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారులపై ఎలాంటి క్రిమినల్ కేసులుండరాదు. ఎంపికైన అభ్యర్థులకు 45 రోజుల పాటు ప్రతిరోజు గంట శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ అనంతరం విధులు కేటాయిస్తారు. పగటి పూట గస్తీ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ తదితర విధులు చేపట్టనున్న హోంగార్డులకు రోజుకు రూ.560 ప్రోత్సాహక భత్యం అందించనున్నారు. ఆసక్తి కలిగిన వారు నవంబరు 30వ తేదిలోగా 'చెన్నై కార్పొరేషన్ హోంగార్డ్స్ కార్యాలయం, సైదాపేట పోలీస్ స్టేషన్, సైదాపేట, చెన్నై-15' అనే చిరునామాలో నేరుగా, పోస్టు ద్వారా దరఖాస్తులు పంపించవచ్చు. మరిన్ని వివరాలకు 9566776222 అనే నెంబరు సంప్రదించవచ్చు.

ఆయుర్వేద సౌందర్య ఉత్పత్తులపై శిక్షణ

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆయుర్వేద బ్యూటీ, హెర్బల్ హెయిర్ అండ్ స్కిన్ కేర్ ఉత్పత్తులపై మూడు రోజుల శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణలో ఆయుర్వేద సోపులు, హెర్బల్ సోపులు, గ్లిజరిన్ సోపు, మెడిసిన్ ఆయిలు సోపు, హెర్బల్ హెయిర్ గ్రోయింగ్ ఆయిల్, హెర్బల్ ఫేస్ వాష్ (డ్రై అండ్ ఆయిల్ స్కిన్), హెర్బల్ హెయిర్ సీరమ్, హెయిర్ కండిషనర్, సహా పలు ఉత్పత్తుల తయారీ వివరించనున్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు శిక్షణలో పాల్గొనవచ్చు. శిక్షణలో పాల్గొనే యువతీ, యువకులకు తక్కువ అద్దెకు వేర్వేరు హాస్టల్ వసతి కల్పించనున్నారు. గిండి సిడ్కో ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని సంస్థ కార్యాలయంలో నవంబరు 4 నుంచి 6వ తేది వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. వివరాలకు www.editn.in అనే వెబ్‌సైట్, 8668102600, 8072914694 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

తాంబరం-చెంగల్పట్టు మధ్య నాలుగో రైలుమార్గానికి ఆమోదం

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తాంబరం-చెంగల్పట్టు మధ్య రూ.757.18 కోట్ల వ్యయంతో నాలుగో రైలు మార్గం ప్రాజెక్టుకు రైల్వే మంత్రి ఆమోదం తెలిపారు. ఎగ్మూర్ నుంచి దక్షిణ జిల్లాలకు చెంగల్పట్టు మీదుగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు వెళ్తుంటాయి. ఈ మార్గంలో ప్రతిరోజు 60కి పైగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు, 300లకు పైగా సబర్బన్ రైళ్లు నడుస్తున్నాయి. కానీ, ఈ మార్గంలో మూడు రైలు మార్గాలు మాత్రమే ఉన్నాయి. అదనపు రైళ్ల కోసం నాలుగో రైలుమార్గం ఏర్పాటుకు సమగ్ర నివేదిక తయారుచేసి రైల్వే మంత్రిత్వ శాఖకు దక్షిణ రైల్వే పంపించింది. ప్రస్తుతం, ఈ ప్రాజెక్ట్ కేంద్ర రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్ ఆమోదం తెలిపారు. దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... తాంబరం-చెంగల్పట్టు మధ్య, 30 కి.మీ మేర రూ.751.18 కోట్లతో నాలుగో రైలు మార్గం ఏర్పాటుకు రైల్వే మంత్రి ఆమోదం తెలిపారని ఈ మార్గంలో 160 కి.మీ వేగంతో రైళ్లే నడిపేలా డిజైన్ చేశామన్నారు. అలాగే, సబర్బన్ రైళ్లు కూడా చెంగల్పట్టు వరకు పొడిగించే అవకాశం ఉంటుందన్నారు.

కుశస్థలి నదిలో పెరుగుతున్న వరద ఉధృతి

తిరుత్తణి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గత కొన్నిరోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాపురం అమ్మపల్లి ఆనకట్ట నుండి శుక్రవారం 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ నేపథ్యంలో, తిరువళ్లూరు జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం భారీవర్షపాతం నమోదైంది. దీనితో తిరుత్తణి సమీపంలోని కుశస్థలి నదీలో వరద నీటి ఉధృతి పెరిగింది. దీంతో నదీ పరివాహక ప్రాంతాల వారిని ప్రజా పనులశాఖ అధికారులు అప్రమత్తం చేశారు. అదేవిధంగా కృష్ణాపురం జలాశయం నుండి వస్తున్న వరదనీటితో పళ్లిపట్టు ప్రాంతంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. వంతెనలు చిక్కుకుపోయాయి. దీనితో ఆ గ్రామాలకు రాకపోకలు అంతరాయం ఏర్పడింది. ప్రజలను వరద ఉధృతి తగ్గేంతవరకు పునరావాస కేంద్రాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ ప్రతాప్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు.




కృష్ణాపురం ఆనకట్ట వద్ద వరద ఉధృతి

పోలీస్ స్టేషన్లలో చర్చలు
కట్టపంచాయతీలతో సమానం...!

● హైకోర్టు

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్లలో చర్చలు కట్టపంచాయతీలతో సమానమని హైకోర్టు మదురై బెంచ్ అభిప్రాయపడింది. మదురై తల్లాకుళం ప్రాంతానికి చెందిన సోమసుందరం హైకోర్టు మదురై బెంచ్‌లో దాఖలుచేసిన పిటిషన్‌లో... తాను తీసుకున్న రుణంతో పాటు వడ్డీ కూడా చెల్లించినా అదనపు వడ్డీ ఇవ్వాలంటూ వేధిస్తున్నారని, తన ఫిర్యాదుపై తల్లాకుళం పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టేలా ఉత్తర్వులు జారీచేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ న్యాయమూర్తి జస్టిస్ పుహళేంది గురువారం విచారించారు. తగిన ఆధారాలతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా, పోలీసులు కేసు నమోదుచేయకుండా ఇరుతరపు వారిని పిలిపించి చర్చలు జరుపుతున్నారని పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. ఈ వాదన పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి... పోలీస్ స్టేషన్‌లో ఒక ఫిర్యాదు అందితే, దానికి సంబంధించి కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని, ఫిర్యాదు తీసుకుని కేసు నమోదుచేయకుండా ఇరుతరపు వారిని పిలిపించి చర్చలు జరపడం కట్ట పంచాయతీలతో సమానమని కోర్టు అభిప్రాయ పడింది. ఫిర్యాదు అందిన తర్వాత, నేరం స్పష్టంగా తెలిస్తే వెంటనే కేసు నమోదుచేసి దర్యాప్తు జరపాలన్న న్యాయమూర్తి, కొన్ని సందర్భాల్లో, కేసు నమోదు చేసే ముందు దర్యాప్తు చేపట్టాల్సిన పరిస్థితుల్లో డీఎస్పీ అనుమతి తీసుకోవాలని న్యాయమూర్తి సూచించారు.

శ్రీలంక జైళ్లలో జాలర్ల రిమాండ్ పొడిగింపు

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జైలులో ఉన్న రామేశ్వరానికి చెందిన 30 మంది జాలర్లు రిమాండ్‌ను నవంబరు 6వ తేది వరకు శ్రీలంక కోర్టు పొడిగించింది. సరిహద్దులు దాటి చేపలు పడుతున్నారంటూ ఈ నెల 8వ తేది రామేశ్వరం, పాంబన్‌లకు చెందిన 30 మంది జాలర్లను శ్రీలంక నావికా దళం అరెస్ట్ చేసింది. జాఫ్నా జైలులో ఉన్న జాలర్ల రిమాండ్ గురువారంతో ముగిసిన నేపథ్యంలో, నవంబరు 6వ తేది వరకు రిమాండ్ పొడిగిస్తూ శ్రీలంక కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. కాగా, శ్రీలంక జైళ్లలో ఉన్న రాష్ట్ర జాలర్లు, వారికి సొంతమైన పడవలను విడిపించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఇప్పటికే ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ లేఖ రాశారు.

26న విశ్వకళా సంగమ హిందుస్థానీ సంగీత విభావరి

వేలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విశ్వకళా సంగమ ఆధ్వర్యంలో ఈ నెల 26న హిందుస్తానీ సంగీత విభావరి జరగనుంది. తిరువాన్మియూర్ కళాక్షేత్ర కాలేజీ క్యాంపస్‌లోని టాగూర్ హాల్‌లో సాయంత్రం 6.30 గంటలకు హిందుస్థానీ సంగీత విద్వాంసురాలు సురంజన బోస్ నేతృత్వంలో రాత్రి 8గంటల వరకు సందీప్ గుర్మెలే (హార్మోనియం), రామ్‌కాట్స్ (తబలా)వాయిద్య సహకారంతో కొనసాగనున్న ఈ కార్యక్రమంలో సంగీత ప్రియులందరూ పాల్గొనవచ్చని విశ్వకళా సంగమ వ్యవస్థాపకుల్లో ఒకరైన సితార విద్వాంసులు జనార్ధన్ మిట్టా, కార్యక్రమ నిర్వాహకులు ఊరా గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు ఊరా లక్ష్మీనరసింహారావులు పిలుపునిచ్చారు.

ఘనంగా వళ్లిమలై ఆలయంలో స్కందషష్ఠి వేడుకలు

వేలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడి సమీపంలోని వళ్లిమలైలో కొలుదీరిన వళ్లీ, దేవసేన సమేత మురుగన్ ఆలయంలో స్కందషష్ఠి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా రెండో రోజైన గురువారం స్వామివార్లకు ఆలయ అర్చకులు ప్రత్యేక అలంకరణ చేసిన అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతించారు.



ప్రత్యేక అలంకారంలో వళ్లిమలై మురుగన్

వర్షపునీరు తొలగించాలంటూ ప్రజల రాస్తారోకో



నిరసన తెలుపుతున్న ప్రజలు

వేలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వేలూరు కార్పొరేషన్ 51వ వార్డులోని ఆర్‌వీనగర్, చిదంబరనాథనగర్ తదితర ప్రాంతాల్లో గత రెండ్రోజులుగా కురుస్తున్న భారీవర్షాల కారణంగా ఆ వీధులన్నీ జలమయమయ్యాయి వరద నీటిని తొలగించాలంటూ అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితంలేదని సమాచారం. దీనితో గురువారం ఉదయం ఆ ప్రాంతప్రజలు వర్షపునీటిలో అధికారుల నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ రాస్తారోకో నిర్వహించారు.

ముంపు ప్రాంతాల్లో మేయర్ పర్యటన



అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మేయర్ సుజాత

వేలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా వేలూరు జిల్లావ్యాప్తంగా కురుస్తున్న భారీవర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చెరువులు, నదులు సహా పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఈ నేపథ్యంలో, వేలూరు సమీపంలోని సదుప్పేరిలో వర్షపునీరు ఇళ్లలోకి చేరి ప్రజలు ఇబ్బంది పడుతున్నారనే సమాచారంతో గురువారం ఉదయం వేలూరు కార్పొరేషన్ మేయర్ సుజాత అధికారులతో కలిసి లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వీధుల్లో చేరిన వరదనీటిని వెంటనే తొలగించాలని ఆమె అధికారులకు ఆదేశించారు.

తడిసిన ధాన్యం బస్తాలకు నష్టపరిహారం ప్రకటించాలి

● టీటీవీ దినకరన్

ప్యారీస్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భారీవర్షం కారణంగా తడిసిన ధాన్యం బస్తాలకు వెంటనే నష్టపరిహారం ప్రకటించి రైతులను ఆదుకోవాలని అమ్మామక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ డిమాండ్ చేశారు. ఆయన గురువారం విడుదల చేసిన ప్రకటనలో, కావేరి డెల్టా ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, వర్షాల వల్ల నీటమునిగిన భూముల వివరాలు సేకరించి నష్టపరిహారం అందజేయాలని కోరారు.

'తోళి' హాస్టల్ నిర్మాణంపై స్టే విధించాలని పిటిషన్

● రూ.10 వేల జరిమానాతో పిటిషన్ తోసిపుచ్చిన హైకోర్టు

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): 'తోళి' హాస్టల్ భవన నిర్మాణానికి స్టే విధించాలనే పిటిషన్ విచారించి, రూ.10,000 జరిమానా విధిస్తూ మద్రాసు హైకోర్టు పటిషన్ తోసిపుచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉద్యోగులకు తక్కువ అద్దెతో, అన్ని వసతులతో కూడిన హాస్టళ్లు 'తోళి' పేరుతో నిర్వహిస్తోంది. ఆ ప్రకారం, మద్రాసు విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని రామానుజం గణిత పరిశోధన సంస్థ వెనుకవైపు తోళి హాస్టల్ భవన నిర్మాణం జరుగుతోంది. ఈ క్రమంలో, హాస్టల్ నిర్మాణానికి నిషేదం విధించాలని కోరుతూ వర్సిటీలో చదువుతున్న పీజీ విద్యార్థి నవీన్, మద్రాసు హైకోర్టులో ప్రజావ్యాజ్యం దాఖలుచేశారు. పిటిషన్‌లో... హాస్టల్ నిర్మాణాల కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ పనులు నిలిపివేయాలని వినతిపత్రం సమర్పించినా, ఎలాంటి చర్యలు లేవని పేర్కొన్నారు. ఈ పిటిషన్ గురువారం విచారించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎంఎం. శ్రీవాస్తవ, జస్టిస్ జి.అరుళ్‌మురుగన్‌లతో కూడిన ధర్మాసనం, ఇలాంటి అనవసరమైన పిటిషన్లు వేయడం మానుకుని, పిటిషన్‌దారుడైన విద్యార్థి చదువుపై దృష్టి సారించాలని సలహా ఇస్తూ, రూ.10 వేల జరిమానాతో పిటిషన్ తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీచేసింది.

నగరంలో ముమ్మరంగా వరద సహాయక చర్యలు

ప్యారీస్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వరద ప్రభావాన్ని అడ్డుకునేందుకు సర్వం సిద్ధంచేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం నగర ప్రజలకు భరోసా ఇచ్చింది. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలోని 200వార్డుల్లో ముమ్మరంగా వరద సహాయక చర్యలు చేపట్టినట్లు సచివాలయం గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాల మేరకు చెన్నై సహా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కురిసిన వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయని, నివాస ప్రాంతాలు, రహదారుల్లో చేరిన వరదనీటిని తొలగింపు వేగవంతం చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. గ్రేటర్ చెన్నైలో ఉన్న 22 సొరంగ మార్గాల్లో చేరిన నీటిని యుద్ధప్రాతిపదికన తొలగించి వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా చేసినట్లు తెలిపింది. నిలిచిపోయిన వర్షపునీటిని తొలగించేందుకు 1,436 మోటారు పంపులు, 150 హెచ్‌పీ మోటారుపంపులు అందుబాటులో ఉన్నాయని, వీటితో పాటు 298 జెట్‌ర్యాటింగ్ వాహనాలను సిద్ధం చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ నెల 17నుండి 22వ తేదీ వరకు కురిసిన వర్షం కారణంగా కూలిన 24 చెట్లను త్వరితగతిన కార్పొరేషన్ సిబ్బంది తొలగించారు. వర్షంలో దెబ్బతిన్న రోడ్లకు ఒకటి, రెండు రోజుల్లో మరమ్మతులు పూర్తిచేయనున్నట్లు రహదారులశాఖ అధికారులు తెలిపారు.

ఏర్కాడులో పర్యాటకుల అడ్డగింత

ప్యారీస్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలో పేదల ఊటీగా పేరొందిన ఏర్కాడులో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పర్యాటకులు అక్కడికి రావద్దని జిల్లా కలెక్టర్ చేసిన ఉత్తర్వులతో కొండ దిగువునే పోలీసులు వాహనాలను అడ్డుకుంటున్నారు. ఏర్కాడుకు వెళ్లే ఘాట్ రోడ్లలో పలు ప్రాంతాల్లో విరిగిపడిన మట్టిచరియలు, చెట్ల తొలగింపు పనులను గత రెండు రోజులుగా నిర్వహించిన కారణంగా ఘాట్‌రోడ్డులో భారీవాహనాల రాకపోకలను నిషేధించారు. వర్షం తగ్గని కారణంగా ముందు జాగ్రత్త చర్యలుగా ఏర్కాడు ప్రధాన ఘాట్‌రోడ్డు, గుబ్బనూరు మీదుగా ఏర్కాడుకు వెళ్లే మార్గాలను శనివారం వరకు మూసివేశారు. ఈ నేపథ్యంలో, మరో మూడు రోజుల వరకు వర్షాలు భారీగా కురుస్తాయని వాతావరణశాఖ జారీచేసిన హెచ్చరికలతో ఏర్కాడుకు పర్యాటకులు రావొద్దని కలెక్టర్ సూచించారు.



కొండ దిగువున వాహనాలను అడ్డుకుంటున్న పోలీసులు

కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు

వేలూరు, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): వేలూరు 'లా' కళాశాల ప్రాంగణంలో గురువారం ఉదయం స్వాతంత్ర్య సమరయోధుల త్యాగం, దేశసంరక్షణ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా వేలూరు జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం అధ్యక్షుడు చంద్రప్రకాష్ పాల్గొన్నారు. అనంతరం లెక్చరర్ జయరేవతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వేదికపై కళాశాల నిర్వాహకులు

అధికారులపై హత్యాయత్నం వ్యవహారం ..
నలుగురికి ఏడేళ్ల జైలుశిక్ష

చెన్నై, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అక్రమణల తొలగింపును అడ్డుకోవడంతో పాటు ప్రభుత్వ అధికారులను కారుతో ఢీకొట్టి హత్యాయత్నం చేసిన కేసులో భర్త, భార్య, కుమారుడు సహా నలుగురికి ఏడేళ్ల జైలుశిక్ష విధిస్తూ తిరునల్వేలి న్యాయస్థానం తీర్పునిచ్చింది. కన్నియాకుమారి జిల్లా వీయనూరు గ్రామానికి చెందిన అర్జునన్, ఆర్‌అండ్‌బీకి చెందిన పోరంబోకు స్థలంలో గోడ నిర్మించాడు. ఈ గోడ వసుమతి ఇంటికి వెళ్లేందుకు అడ్డుగా ఉండడంతో, జిల్లా కలెక్టర్, హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ దాఖలుచేశారు. ఈ పిటిషన్ విచారించిన హైకోర్టు, ఆక్రమణలు తొలగించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. హైకోర్టు ఉత్తర్వులతో 2008 ఫిబ్రవరి 6వ తేది తక్కలై రహదారుల శాఖ అధికారులు అంతోని జేవియర్, సుందరం, కానిస్టేబుల్ విన్సెంట్ ఆక్రమణలు తొలగించేందుకు వెళ్లారు. ఆ సమయంలో అర్జునన్, ఆయన భార్య కనీష్ పాయ్, అల్లుడు రసల్‌రాజ్ అధికారులను అడ్డుకున్నారు. అధికారులను దుర్భాషలాడిన సమయంలో, అర్జునన్ కుమారుడు సెంథిల్‌కుమార్ కారులో వచ్చి అధికారులను ఢీకొట్టగా, అధికారులు అంతోని జేవియర్, సుందరం, కానిస్టేబుల్ విన్సెంట్‌లకు గాయలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు నమోదుచేసిన కేసు వల్లియూర్ సబ్ కోర్టులో విచారణ సాగుతోంది. 2023లో కోర్టు, అర్జునన్ సహా నలుగురికి ఏడేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ నలుగురు దాఖలుచేసిన పిటిషన్‌ను తోసిపుచ్చిన తిరునల్వేలి జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి సెల్వం, వారిని విధించిన ఏడేళ్ల జైలుశిక్ష ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఉగ్రవాది అబూబకర్ సిద్దిఖ్‌ను విచారించనున్న ఎన్ఐఏ

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాది అబూబకర్ సిద్దిఖ్‌ను ఎన్ఐఏ అధికారులు ఏడు రోజులు కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న అబూబకర్‌ను ఆంధ్ర రాష్ట్రంలో జూలై 1వ తేది అరెస్ట్ చేశారు. ప్రస్తుతం పుళల్ జైలులో ఉన్న ఆయనను కస్టడీకి తీసుకొనేలా ఎన్ఐఏ అధికారులు అవసరమైన పత్రాలు జైలు అధికారులకు సమర్పించారు. అనంతరం అబూబకర్‌ను విచారణ నిమిత్తం ఆంధ్ర రాష్ట్రానికి తీసుకెళ్లినట్లు సమాచారం.

చెన్నై-తిరుచ్చి విమానంలో సాంకేతిక లోపం

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం నుంచి గురువారం ఉదయం తిరుచ్చికి బయల్దేరిన ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానంలో హఠాత్తుగా సాంకేతికలోపం ఏర్పడింది. దీంతో విమానాన్ని రన్‌వేపై నిలిపివేశారు. చెన్నై నుంచి గురువారం ఉదయం 5.45 గంటలకు 72 మంది ప్రయాణికులు, ఐదుగురు సిబ్బందితో తిరుచ్చికి ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం బయల్దేరింది. కొద్దిసేపట్లో టేకాఫ్ కానుండగా విమానంలో సాంకేతిక లోపాన్ని పైలెట్ గుర్తించారు. ఈ విషయాన్ని విమానాశ్రయ కంట్రోల్ రూమ్ అధికారులకు తెలియజేశారు. అధికారుల సూచనలతో, రన్‌వే పైనే విమానాన్ని అత్యవసరంగా నిలిపివేశారు. అనంతరం వాహనం సాయంతో విమానాన్ని బయల్దేరిన ప్రాంతానికి తీసుకొచ్చారు. ప్రయాణికులను విమానాశ్రయంలోని విశ్రాంతి గదులకు పంపిన అధికారులు, మరో విమానంలో వారిని తిరుచ్చికి పంపించారు.

విద్యుదాఘాతంతో ఏనుగు మృతి



ప్యారీస్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు నియోజకవర్గం తొండాముత్తూరు ప్రాంతంలో విద్యుదాఘాతానికి 20 యేళ్ల మగ ఏనుగు మృతి చెందనట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. తొండాముత్తూరు పరిసరాల్లోని అడవుల నుండి ఆహారం, నీటికోసం బయటికి వస్తున్న ఏనుగుల గుంపు పొలాలు, నివాస ప్రాంతాల్లో సంచరిస్తుంటాయి. బుధవారం రాత్రి అడవిలో నుండి బయటికొచ్చిన సుమారు 20యేళ్ల వయసున్న ఓ మగఏనుగు తొండాముత్తూరు కుంబేపాళయంలో ఉన్న నాగరాజన్ అనే రైతు పొలంలోకి ప్రవేశించింది. అక్కడున్న హైవోల్టేజీ విద్యుత్ స్తంభాన్ని ఆ ఏనుగు తొండంతో ఢీకొనడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతిచెందింది. సమాచారం తెలిసి అక్కడికి చేరుకున్న అటవీశాఖ అధికారులు ఏనుగు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఇంకుడు గుంతలో పడి మూడేళ్ల బాలిక మృతి

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇంకుడు గుంతలో పడి మూడేళ్ల బాలిక మృతిచెందింది. కోయంబత్తూర్ జిల్లా కోట్టూరులో ఉన్న కొబ్బరి పీచు కర్మాగారంలో మధ్యప్రదేశ్‌కు చెందిన దంపతులు పనిచేస్తున్నారు. వారు కర్మాగారం ప్రాంగణంలోని ఓ గదిలో ఉంటున్నారు. ఈ క్రమంలో, బుధవారం ఉదయం దంపతుల మూడేళ్ల బాలిక రోహిణి కనిపించకపోవడంతో, తల్లిదండ్రులు ఆమె కోసం కర్మాగారం, చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో, కర్మాగారంలో ఏర్పాటుచేసి పదడుగుల ఇంకుడు గుంతలో బాలిక మృతదేహం కనుగొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెళ్లి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



మృతురాలు రోహిణి (ఫైల్‌ఫొటో)

ఏడు పాఠశాలలకు బాంబు బెదిరింపు

పెరంబూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొలంబూర్, జేజే నగర్ ప్రాంతాల్లోని నాలుగు ప్రైవేటు పాఠశాలలు, ఆవడి ప్రాంతంలోని మూడు ప్రైవేటు పాఠశాలలు మొత్తం 7 పాఠశాలలకు ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. గురువారం వేకువజామున 1.30 గంటలకు వచ్చిన ఈ బాంబు బెదిరింపు విషయాన్ని పాఠశాల నిర్వాహకులు పోలీసులకు తెలియజేశారు. బాంబ్ స్క్వాడ్ , డాగ్ స్క్వాడ్‌తో ఆయా పాఠశాలలకు చేరుకున్న పోలీసులు, సుమారు 8 గంటలకు తనిఖీలు చేపట్టి, ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు. నాలుగు రోజుల సెలవులు, వర్షాల కారణంగా బుధవారం సెలవు అనంతరం గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, బాంబు బెదిరింపు వార్త తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాలలకు ఫోన్ చేశారు. బాంబు బెదిరింపు అసత్యమని, ఎలాంటి భయాందోళనలు చెందవద్దని పాఠశాల యజమాన్యాలు తెలియజేసినా, చాలా మంది తల్లిదండ్రులు, తమ పిల్లలను పాఠశాలలకు పంపలేదు. కాగా, ఈ-మెయిల్ పంపిన చిరునామా కోసం పోలీసులు విచారణ చేపట్టారు.

సకాలంలో వరదనీటిని తొలగించండి

అధికారులకు రహదారుల రీసెర్చ్ కేంద్రం డైరెక్టర్ శరవణన్ ఆదేశం

వేలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులశాఖ రీసెర్చ్ కేంద్రం డైరెక్టర్ శరవణన్ గురువారం ఉదయం వేలూరులో వర్షాలకు నీటమునిగిన లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వరదనీటిని తొలగింపు పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేలూరు సమీపంలోని విరింజిపురం, చెదువాలై రోడ్డు, పాలూరు డ్యాం తదితర ప్రాంతాల్లో పర్యటించి అక్కడి వరద పరిస్థితులపై అధికారులను అప్రమత్తం చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్ చిత్తూరు రోడ్డులో జరుగుతున్న కాలువ వంతెన నిర్మాణ పనులపై కూడా ఆయన అడిగితెలుసుకున్నారు. ఆయనతో పాటు వేలూరు కోట్టై డివిజన్ ఇంజనీర్ సుందర్, తిరువణ్ణామలై విడిజన్ ఇంజనీర్ శరవణన్, ధనశేఖరన్, రహదారులశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఇళంగో తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం చేయండి

● కాంగ్రెస్ శ్రేణులకు సెల్వపెరుంతగై పిలుపు

ప్యారీస్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక పనుల్లో పాల్గొనాల్సిందిగా కాంగ్రెస్ శ్రేణులకు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుంతగై పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన గురువారం విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాల కారణంగా ఐదు రోజులకు పైగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జనజీవనం స్తంభించిందని, వరద ప్రభావిత ప్రాంతాల్లో పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలు సహాయక పనుల్లో పాల్గొనాలని సూచించారు. ముఖ్యంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, చెట్లు, ఇంటి గోడలు కూలిన ప్రాంతాల్లో ప్రభుత్వ ఉద్యోగులకు సహకరించాలని ఆయన సూచించారు.

కారు ఢీకొని తాత, మనవరాలి మృతి

● డ్రైవింగ్ చేసిన బాలుడి సహా తల్లి అరెస్ట్

చెన్నై, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బాలుడు నడిపిన కారు ఢీకొని తాత, మనవరాలు మృతిచెందిన ఘటనలో, సదరు బాలుడు సహా అతడి తల్లిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా వున్నాయి... తిరునల్వేలి వడకనైకుళం ప్రాంతానికి చెందిన జోసఫ్ (65) అదే ప్రాంతంలో సెలూన్ నడుపుతున్నాడు. దీపావళి పండుగ రోజున జోసఫ్, తన మనవరాలు వర్షతో కలసి మోపెడ్‌పై వెళ్తున్నాడు. శివజ్ఞానపురం సమీపంలో వస్తున్న మోపెడ్‌ను అతి వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ఘటనలో మోపెడ్ నుంచి కిందపడిన జోసఫ్, వర్ష తలకు బలమైన గాయాలు కావడంతో ఇద్దరూ ఘటనా స్థలంలోనే మృతిచెందారు. దీనిపై పోలీసులు జరిపిన విచారణలో, కారు నడిపింది 16 ఏళ్ల మైనర్ బాలుడని, బాలుడు తండ్రి సుబ్రమణియన్ విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నట్లు తెలిసింది. బాలుడికి కారు ఇచ్చిన తల్లి దివ్య (41)పై పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కేసులో ఇరువురిని అరెస్ట్ చేసిన పోలీసులు, బాలుడిని తిరునల్వేలిలోని జువైనల్ హోంకు, తల్లి దివ్యను తిరునల్వేలి కొక్కిరకుళంలోని మహిళా జైలుకు తరలించారు.

తీరానికే పరిమితమైన పడవలు

● రూ.65 కోట్ల చేపల వ్యాపారం బంద్

చెన్నై, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నాగపట్టణం, పుదుకోట, తంజావూరు, కారైక్కాల్ జిల్లాలకు చెందిన జాలర్లు ఐదు రోజులుగా చేపల వేటకు వెళ్లకపోవడంతో, సుమారు రూ.65 కోట్ల మేర వ్యాపారం నిలిచిపోయింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా డెల్టా జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వాయుగుండం ప్రభావంతో సముద్ర వాతావరణం అల్లకల్లోలంగా ఉండడంతో, నాగపట్టణం, పుదుకోట, తంజావూరు, కారైక్కాల్ జిల్లాలకు చెందిన జాలర్లు, తదుపరి ప్రకటన వెలువడే వరకు చేపల వేటకు వెళ్లరాదని ఆయా జిల్లాల అధికారులు హెచ్చరికలు జారీచేశారు. ఈ కారణంగా, నాగపట్టణం జాలర్లు ఈ నెల 18వ తేది నుంచి గురువారం వరకు చేపల వేటకు వెళ్లలేదు. దీంతో, సుమారు 700 పడవలు తీరంలోనే లంగరు వేసారు. వేదారణ్యం, మైలాడుదురై, కారైక్కాల్, పుదుకోట తదితర ప్రాంతాలకు చెందిన జాలర్లు కూడా చేపల వేటకు వెళ్లలేదు. దీంతో నాగపట్టణంలో గత ఐదు రోజుల్లో రూ.15 కోట్లు, మైలాడుదురైలో రూ.10 కోట్లు, తంజావూరులో రూ.10 కోట్లు, పుదుకోటలో రూ.10 కోట్లు, కారైక్కాల్‌లో రూ.15 కోట్లు చేపల వ్యాపారం నిలిచిపోయింది.

కోలీవుడ్‌లో విషాదం

● ఒకేరోజు ఇద్దరు ప్రముఖుల కన్నుమూత
● సంగీత దర్శకుడు సబేష్, మనోరమ కుమారుడు, నటుడు భూపతి మృతి



భూపతి భౌతికకాయానికి కార్తి, పూచ్చి మురుగన్, కరుణాస్ నివాళులు

కోలీవుడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఒకేరోజు సినీ సంగీత దర్శకుడు సబేష్, దివంగత నటి మనోరమ కుమారుడు, నటుడు భూపతి ఒకేరోజు కన్నుమూయడంతో కోలీవుడ్ దిగ్భ్రాంతికి గురైంది.



సబేష్ (ఫైల్‌ఫొటో)

మ్యూజీషియన్ సంఘం అధ్యక్షుడు, సం గీత దర్శ కుడు సబేష్ (68) గురు వారం కన్నుమూశారు. సబేష్ ఇటీవల అనారో గ్యానికి గురికావడం తో నగరంలోని ప్రైవేటు ఆస్ప త్రిలో చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం 12.15 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. సినీ ప్రము ఖులు, అభిమానుల సందర్శనార్థం వలసరవాక్కం లోని ఆయన నివాసంలో భౌతికకాయాన్ని ఉంచారు. ఆయనకు భార్య గీత, అర్చన, కార్తీక్ అనే ఇద్దరు పిల్లలున్నారు. సబేష్ అంత్యక్రియలు శుక్ర వారం వలసరవాక్కం, బృందావన్ నగర్‌లోని శ్మశా నవాటికలో జరుగనున్నాయి. ప్రముఖ సంగీత దర్శకుడు దేవా సంగీతం సమ కూర్చిన అనేక హిట్ పాటల వెనుక సబేష్ పాత్ర ఎంతో ఉంది. అలాగే, సబేష్ తన సోదరుడు మురళితో కలిసి పలు చిత్రాలకు సంగీతం సమకూర్చా రు. వీటిలో 'హింసై అరసన్ 23వ పులకేశి', 'మాయాండి కుడుంబత్తార్', 'గోరిపాళ్యం', 'పొక్కిషం', 'ఆటోగ్రాఫ్' 'తవమాయ్ తవ మిరుందు' వంటి అనేక హిట్ చిత్రాలున్నాయి.

ఇదిలా ఉండగా దివంగత సీనియర్ నటి మనో రమ ఏకైక కుమారుడు భూపతి (70) గురువారం మృతి చెందారు. భూపతి అనారోగ్యం కారణంగా గత వారం నగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకుని ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ఆయన టి.నగర్ నీలకంఠ మెహతా స్ట్రీట్‌లో వున్న తన నివాసంలో తన తల్లి ఉపయోగించిన మంచం పైనే పడుకుని తుదిశ్వాస విడిచారు. నటుడు విసు తరకెక్కించిన 'కుడుంబం ఒరు కదంబం' అనే చిత్రం ద్వారా వెండితెరకు పరిచయమైన భూపతి.. పలు చిత్రాల్లో చిన్నచిన్న పాత్రలతో పాటు పలు సీరియల్స్‌లో నటించారు.

భూపతి భౌతికకాయానికి నడిగర సంఘం కోశాధికారి, హీరో కార్తి, ఉపాధ్యక్షులు పూచ్చి మురుగన్, కరణాస్ మూలమాల వేసి నివాళులర్పించారు. భూపతికి కుమారుడు రాజరాజన్, కుమార్తెలు అభిరామి, మీనాక్షి ఉన్నారు. శుక్రవారం టి.నగర్‌లోని కన్నమ్మపేట శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు వెల్లడించారు.

ప్రేమ బాధితుల్లో మహిళలే అధికం



● రష్మిక మందన్నా

చిత్రజ్యోతి

ప్రేమ విఫలమైతే పురుషుల కంటే మహిళలే అధికంగా బాధపడతారని, ప్రేమ ఫెయిల్యూర్ బాధితుల్లో ఎక్కువగా మహిళలే ఉంటారని ప్రముఖ హీరోయిన్ రష్మిక మందన్నా అభిప్రాయపడ్డారు. ఆమె తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'ప్రేమ విఫలమై విడిపోతే ఎక్కువగా బాధపడేది పురుషుల కంటే మహిళలే. అయితే, పురుషులు తమ ప్రేమను వ్యక్తం చేసేందుకు గడ్డం పెంచుతారు. మద్యం సేవించి తమ ప్రేమ విఫలం గురించి ఇతరులకు వివరిస్తారు. కానీ, మహిళల విషయానికి వస్తే గడ్డం పెంచలేరు. మద్యం సేవించి తమ బాధను ఇతరులకు వ్యక్తం చేయలేరు. ఎవరికీ తెలియకుండా లోలోన కుమిలిపోతుంటారు. పైగా తమ ప్రేమ విఫలమైన విషయాన్ని ఇతరులతో షేర్ చేసుకునే అవకాశం మహిళలకు రాదు. అందుకు వారు తమ బాధను బయటకు వ్యక్తం చేయలేక బాధితులుగా మిగిలిపోతున్నారు' అని పేర్కొన్నారు.

వ్యవసాయం కంటే సినిమా తీయడమే కష్టం

● 'తడై అడై ఉడై' చిత్ర దర్శకుడు అరివళగన్

ప్రస్తుత సమాజంలో వ్యవసాయం చేయడం కంటే సినిమా నిర్మించడం చాలా కష్టమని 'తడై అడై ఉడై' చిత్ర దర్శకుడు అరివళగన్ అభిప్రాయపడ్డారు. గాంధిమతి పిక్చర్స్ పతాకంపై అవివళగన్ మురుగేశన్ నిర్మాణంలో 'అంగాడి తెరు' మహేష్, 'తిరుక్కురల్' గుణాబాబు ప్రధాన పాత్రల్లో 1990 సంవత్సరానికి ముందు జరిగిన యదార్థ సంఘటనతో రూపొందించిన 'తడై అడై ఉడై' సినిమా ఈ నెల 31 న విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని చిత్ర ఆడియో రిలీజ్, ట్రైలర్‌ను బుధవారం రాత్రి నగరంలో రిలీజ్ చేశారు. చిత్ర దర్శకుడు అరివళగన్ మాట్లాడుతూ, 'ఈ సినిమా కోసం ప్రతి ఒక్కరూ తమ రక్తాన్ని ధార పోశారు. ఈ సినిమా కోసం పనిచేసిన ప్రతి ఒక్కరిలో అపారమైన ప్రతిభ దాగివుంది. సినిమా అనేది వ్యాపారం. మూవీ విడుదలైన తర్వాత నెల రోజుల పాటు ప్రదర్శనకు నోచుకోకపోతే చాలా కుటుంబాలు రోడ్డున పడతాయి. కానీ, సినిమా గురించి విమర్శకులు రివ్యూ చేయకపోయినా ఏం కాదు. అందుకే సినిమాను బతకనివ్వండి అని కోరారు. సంగీత దర్శకుడు సాయ్ సుందర్ మాట్లాడుతూ, ఈ అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు' అన్నారు.



'తడై అడై ఉడై' చిత్ర ఆడియో రిలీజ్

విద్యార్థుల కోసం 'పరిసు' ప్రత్యేక ప్రదర్శన

● చిత్ర బృందానికి అభినందనలు

దర్శక నిర్మాత కళ అల్లూరి స్వీయ నిర్మాణంలో కళ క్రియేషన్స్ పతాకంపై తెరకెక్కిన 'పరిసు' చిత్రాన్ని విడుదలకు ముందే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ చిత్రాన్ని చూసిన విద్యార్థులు చిత్ర బృందాన్ని అభినందించారు. జాన్విక ప్రధాన పాత్ర పోషించారు. సాధారణంగా ఒక చిత్ర నిర్మాణం పూర్తయితే, చిత్రపరిశ్రమలోని ప్రముఖులు, సెలెబ్రిటీల కోసం ప్రత్యేక షోలు వేస్తుంటారు. కానీ, ఈ సినిమాలో మంచి సందేశం ఉండటంతో విడుదలకు ముందే విద్యార్థులకు ప్రత్యేక షో వేసి చూపించారు. ఈ ప్రదర్శన తర్వాత హీరోయిన్ జాన్విక విద్యార్థులతో ముచ్చటిస్తూ, 'ఈ సినిమాలో బహుముఖ కోణాల్లో కనిపించే పాత్రలో నటించాను. తండ్రి నుంచి స్ఫూర్తిని పొందే కుమార్తెగా, తుపాకీ మోసే సైనికురాలిగా ఇలా విభిన్న పాత్రల్లో నటించే అవకాశం దక్కింది. ఇందు కోసం దర్శకుడుకి రుణపడివుంటాను' అని పేర్కొన్నారు. ఈ చిత్రం ఈ నెల 31వ తేదీన విడుదల చేయనున్నారు.




'పరిసు' చిత్ర బృందం

● చెన్నై శివారు ప్రాంతంలో వెలసిన ఆలయం
● అగస్త్యమహర్షిని అనుగ్రహించిన అప్పూరు పెరుమాళ్
● కొండపై వెలసిన వేంకటేశ్వరుడు

ఔషధగిరి... శ్రీహరి సన్నిధి





దేశవ్యాప్తంగా వేంకటేశ్వరస్వామి వివిధ ఆలయాల్లో వివిధ రూపాల్లో భక్తులను అనుగ్రహిస్తున్నారు. శ్రీవారి ఆలయాలు వేటికవే ప్రత్యేకతలను కలిగి ఉంటాయి. అలాంటి ఆలయాల్లో అప్పూరు ఔషధగిరి నిత్య కల్యాణ పెరుమాళ్ ఆలయం ఒకటి. చెన్నై - తాంబరం మార్గంలో మరైమలర్ నగర్ సమీపంలో అప్పూరు గ్రామం వద్ద ఈ ఔషధగిరి క్షేత్రం ఉంది. ఈ కొండలో వివిధ రకాల మూలికలలుండటంతో ఈ కొండను ఔషధగిరిగా పిలుస్తున్నారు. ఈ కొండమెట్ల మార్గం గుండా భక్తులు నడచివెళ్తుంటే మూలికా సుగంధం వస్తుంటుంది. ఆ మూలికల వాసన పీల్చటం వలన కొండమెట్లు ఎక్కడంలో అలసట తెలియదు. అంతే కాకుండా కొండ మీద ఆలయంలో సాధారణ రోజుల్లో భక్తుల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల ఆ ప్రాంతంలో ఎంతసేపైనా ఉండి శ్రీవారిని దర్శించుకుని ధ్యానం కూడా చేసుకోవచ్చు.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి


ఔషధగిరి ప్రసన్న వెంకటేశ్వరస్వామి



పర్వతాలయ ప్రవేశద్వారం

ఆధ్యాత్మికం

పూర్వం ఈ క్షేత్రాన్ని 63 మంది మునులు సందర్శించి శ్రీవారి అనుగ్రహం పొంది ముక్తినొందారని పౌరాణిక గాథలను బట్టి తెలుస్తుంది. అగస్త్యమహర్షి ఈ క్షేత్రంలో తపమాచరించి నిత్యకల్యాణ పెరుమాళ్ ఆశీర్వాదం పొందినట్టు స్థలపురాణం చెబుతుంది. ఆలయంలో నిత్యకల్యాణ ప్రసన్న వెంకటేశ పెరుమాళ్ శంఖు, చక్రధారియై నిలిచిన భంగిమలో భక్తులకు దర్శనమిస్తారు. శ్రీవారి ఆలయాల్లో స్వామవారి వక్షస్థలంలో మహాలక్ష్మి నిత్యవాసం చేయడం ఆనవాయితీ. అయితే ఈ ఆలయంలో శ్రీవారే మహాలక్ష్మీ స్వరూపుడై దర్శనమిస్తుంటారు. అందుకే ఈ ఆలయంలోని నిత్య కళ్యాణ ప్రసన్న వెంకటేశ పెరుమాళ్‌ను దర్శించుకుంటే వివాహ ఆటంకాలు తొలగిపోతాయని, సంతానం ప్రాప్తిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. కొండపై లక్ష్మీదేవి పాదముద్ర కూడా ఉంది. మంగళ, శుక్రవారాల్లో ఈ పాదముద్ర దర్శించి శ్రీవారిని వేడుకుంటే అష్టైశ్వర్యాలు కలుగుతాయని చెబుతారు.



ఆలయ ముఖ మండపం



గర్భాలయంలో శ్రీవారు



పచ్చదనంతో ఉన్న ఔషదగిరి

ఆలయ విశేషాలు...

పురటాసి శనివారాల్లో ఔషధగిరి నిత్య కల్యాణ ప్రసన్న వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటే సకల సౌభాగ్యాలు కలుగుతాయని చెబుతారు. పురటాసి శనివారాల్లో ఈ ఆలయంలో స్వామిని దర్శించేందుకు వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. మెట్ల దారి మీదుగా నడిచి ఔషధగిరి చేరి, చుట్టూ పచ్చదనంతో ప్రశాంతమైన వాతావరణంలో ఉన్న ఆలయాన్ని దర్శించడం భక్తులకు వింత అనుభూతిని కలిగిస్తుంది.



కొండపైకి వెళ్లేందుకు మెట్లదారి

ఎలా వెళ్ళాలి?

నగరంలోని పలు ప్రాంతాల నుండి సిటీ బస్సులో మరైమలర్ నగర్ వెళ్ళాలి. అక్కడి నుండి సామియార్‌గేట్ రైల్వేగేట్ మార్గంలో సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది అప్పూరు గ్రామం. మరైమలర్ నగర్ నుండి ఆటోలు, ట్యాక్సీల్లో అప్పూరు గ్రామాన్ని చేరుకోవచ్చు. చెంగల్పట్టు జిల్లా సింగపెరుమాళ్‌కోవిల్ నుంచి అప్పూరు వెళ్లేందుకు బస్ సదుపాయం కూడా ఉంది. ఆ గ్రామంలోని ఔషధగిరి ఎక్కేందుకు 500 మెట్ల దారి కూడా ఉంది. ఈ ఆలయాన్ని ప్రతిరోజూ ఉదయం 8 నుండి 10 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 5 నుండి 6 గంట వరకూ తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తుంటారు.



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామివారు

నిర్దేశిత సమయంలో తిరుత్తణి ఆలయం మూసివేత

తిరుత్తణి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ ఆలయంలో స్కందషష్ఠి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రతిరోజు ఉదయం లక్షార్చన, సాయంత్రం పుష్పాంజలి దీపారాధన తదితర పూజలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో, మూడో రోజైన శుక్రవారం నుండి సోమవారం వరకు నిర్దేశిత సమయంలో శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం ఆలయాన్ని మూసివేయనున్నట్లు ఆలయ పాలకమండలి ప్రకటించింది. ఆ సమయంలో అర్చకులు స్వామివారికి బిల్వపత్రాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని దీంతో భక్తులకు 9 గంటల నుండి 10.30 గంటల వరకు మురుగన్ దర్శనం ఉండదని, పూజల అనంతరం మళ్లీ తిరిగి స్వామివారి దర్శనానికి అనుమతించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఆలయ జాయింట్ కమిషనర్ రమణి, ట్రస్టీ చైర్మన్ శ్రీధరన్, ట్రస్టీలు సురేష్‌బాబు, జి.మోహన్, ఎం.నాగన్, ఉషా రవి తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

నేడు 'తోల్‌కాపియం పార్క్' ప్రారంభం

చెన్నై, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్‌ఏ పురంలో పునరుద్ధరించిన తోల్‌కాపియం పార్క్‌ను శుక్రవారం ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించనున్నారు. చెన్నై నదుల పునరుద్ధరణ ట్రస్ట్ తరఫున తోల్‌కాపియం పార్క్‌ను రూ.42.45 కోట్లతో అభివృద్ధి చేశారు.. ఈ పార్క్ ఏరియాలో 1, 2 కలిపి శాంతోమ్ హై రోడ్డులో హై లైవల్ ఫుట్ బ్రిడ్జి నిర్మించారు. అలాగే, డా.డీజీఎస్ దినకరన్ రోడ్డులోని ఫైప్ కెనాల్‌కు బదులు మూడు లైన్ల వాల్డ్ కెనాల్ నిర్మించారు. అభివృద్ధిచేసిన పార్క్‌ను సీఎం స్టాలిన్ శుక్రవారం ప్రారంభించనున్నారని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

రాష్ట్రంలో మతవాద శక్తులకు తావులేదు

● వీఐటీ సభలో ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో



సభలో మాట్లాడుతున్న వైగో

వేలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సనాతన, హిందుత్వ శక్తులకు తావులేదని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో పేర్కొన్నారు. వేలూరులోని వీఐటీ విశ్వవిద్యాలయంలో గురువారం పెరియార్ స్మారక ఉపన్యాసం కార్యక్రమం జరిగింది. వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్ అధ్యక్షతన భారతీదాసన్ తమిళ సాహిత్య మండలి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, ద్రావిడర్ కళగం అధ్యక్షుడు కె.వీరమణి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైగో మాట్లాడుతూ, నేటికాలంలో స్వచ్ఛంద సేవకులను కలవడం చాలా సులభం. కానీ అన్నాదురై కాలంలో లేఖ ద్వారా సేవ సంస్థలకు సమాచారం అందించేవారన్నారు. ద్రావిడ మున్నేట్ర కళగం మొదటి నుండి ఒకే విధానాన్ని అవలంభించిందని, శ్రేణుల్లో విభిన్న ఆలోచనలు ఉన్నప్పటికీ వారి అంతిమ నినాదం ఒకటేనన్నారు. ఉద్యమాల్లో వచ్చిన చీలకల వల్లే ఎంజీఆర్ ముఖ్యమంత్రి అయ్యారన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో బీజేపీ నేతృత్వంలో మతవాద శక్తులు పనిచేస్తున్నాయని, వాటికి తమిళనాడులో తావులేదన్నారు. ఈ కార్యక్రమంలో వీఐటీ నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శూరసంహారం వేడుకలకు ప్రత్యేక బస్సులు

చెన్నై, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్‌లో ఈ నెల 27న జరుగనున్న శూరసంహారం వేడుకలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్‌ఈటీసీ) విడుదల చేసిన ప్రకటనలో, చెన్నై, కోవై, సేలం తదితర ప్రాంతాల నుంచి తిరుచెందూర్‌కు ఈ నెల 26న ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. అలాగే, 27న తిరుచెందూర్ నుంచి చెన్నై, కోవై, సేలం తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. అలాగే, తిరుచెందూర్ నుంచి ఈరోడ్, తిరుప్పూర్, బెంగళూరుకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఎస్‌ఈటీసీ తెలిపింది.

డీఎంకే నాయకులతో సీఎం సమీక్ష



సీఎంతో పార్టీ నేత

అడయార్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీ శ్రేణులను సమాయాత్తం చేయడంపై ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ దృష్టిసారించారు. ఇందులోభాగంగా నియోజకవర్గాల వారీగా ఆయన పార్టీ నేతలతో ఆయన సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. గురువారం దురైయూరు, తిరుమయం నియోజకవర్గాల నేతలతో సమీక్ష చేశారు. ఎన్నికలకు తక్కువ సమయమే ఉండటంతో అన్ని విభాగాల నేతలను కలుపుకుని పార్టీ విజయం కోసం కృషి చేయాలని ఆయన సూచించారు.

నేటినుండి నాగాత్తమ్మన్ ఆలయ ఉత్సవాలు

ప్యారీస్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రిప్లికేన్ రామ్‌నగర్‌లోని నాగాత్తమ్మన్ ఆలయ 29వ వార్షిక నాగచతుర్థి ఉత్సవాలు శుక్రవారం గణపతి హోమంతో ప్రారంభమై ఈ నెల 27వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. శనివారం ఉదయం 9.30గంటలకు నాగులచవితిని పురస్కరించుకుని గ్రామ దేవత మాతమ్మ ఆలయం నుండి 108 క్షీరకలశాలతో ఊరేగింపు బయలుదేతుంది. సాయంత్రం 6 గంటలకు నాగ దేవతకు వెండి కవచంతో అలంకారం, భక్తి సంగీత కార్యక్రమం, ప్రసాద విచరణ కార్యక్రమం జరుగుతుంది. 26, 27వ తేదీల్లో 108 శంఖాలతో అమ్మవారికి అభిషేకం, సహపంక్తి భోజనం, ఊంజల్ సేవ, దీపారాధన, విడయాత్రి ఉత్సవం జరుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

చెన్నై పోర్టును సందర్శించిన జపాన్ బృందం

చెన్నై, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జపాన్‌లోని 'ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ పోర్ట్స్ అండ్ హార్బర్స్' (ఐఏపీహెచ్)కు చెందిన 15 మంది సభ్యుల బృందం బుధ, గురువారాల్లో చెన్నై పోర్ట్‌ను సందర్శించింది. చెన్నై పోర్ట్ అథారిటీతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ఐఏపీహెచ్ ప్రధాన కార్యదర్శి మసామికో పురుయిచి నేతృత్వంలో ఈ ప్రతినిధి బృందం చెన్నై వచ్చింది. ఈ బృందంలో యోకోహామా, టోక్యో, ఒసాకా, కోబ్, నగోయా, టోమకోమై పోర్ట్ అథారిటీలు, ఓవర్సీస్ కోస్టల్ ఏరియా డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జపాన్, క్యోటో, కనగావా విశ్వవిద్యాలయాలకు చెందిన ఉన్నతాధికారులు వున్నారు. చెన్నై పోర్ట్ అథారిటీ ఛైర్‌పర్సన్, కామరాజర్ పోర్ట్ ఛైర్మన్, ఇండియన్ పోర్ట్స్ అసోసియేషన్ ఛైర్మన్ సునీల్ పలివాల్ నేతృత్వంలోని అదికారులు జపాన్ బృందానికి స్వాగతం పలికారు. మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి వంటివాటిపై జపాన్ బృందం చెన్నై పోర్ట్‌తో ఒప్పందం కుదుర్చుకోనుంది.



కాల్వల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

● జిల్లా కలెక్టర్‌కు రైతుల విజ్ఞప్తి

తిరుత్తణి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మున్సిపాలిటీలోని జ్యోతినగర్ సరస్సు పూర్తిగా నిండింది. దీంతో మిగుల జలాలను అధికారులు రాణిపేట జిల్లాకు విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, జ్యోతినగర్ బైపాస్‌రోడ్డు నుండి ఆంధ్రప్రదేశ్ పుత్తూరు వరకు ఉన్న పంటకాలువ దిగువన ఉన్న భూములు ఆక్రమణలకు గురయ్యాయి. దీనితో వరదనీరు పొలాల్లోకి చేరి రైతులకు భారీ నష్టాన్ని మిగుల్చుతుంది. దీనిపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు అధికారులకు చెప్పినా, ఫలితంలేదని రైతులు వాపోతున్నారు. వర్షాకాలం సమీపిసే పొలాలన్నీ జలమయమవుతున్నాయని, జిల్లా కలెక్టర్ దీనిపై స్పందించి త్వరితగతిన కాలువ స్థలాలపై సర్వే చేయించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తున్నారు.

ఆలయ నిధులతో కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించొద్దు : మద్రాసు హైకోర్టు

చెన్నై, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆలయ నిధులతో వాణిజ్య సముదాయాలు నిర్మించవద్దని అన్ని ఆలయాలకు సర్క్యులర్ జారీచేయాలని హిందూ దేవాదాయ శాఖను మద్రాసు హైకోర్టు ఆదేశించింది. కందకోట్టం ముత్తుకుమారస్వామి ఆలయ ప్రాంతంలో వాణిజ్య సముదాయం, నివాసాలు నిర్మించంపై నిషేధం విధించాలని కోరుతూ విల్లివాక్కంకు చెందిన ఏపీ పళని మద్రాసు హైకోర్టులో ప్రజావ్యాజ్యం దాఖలుచేశారు. ఈ పిటిషన్ గురువారం విచారించిన హైకోర్టు కందకోట్టం ముత్తుకుమారస్వామి ఆలయ స్థలంలో వాణిజ్య సముదాయాలు, నివాస భవనాల నిర్మాణం కొనసాగించవచ్చని, దేవాదాయ శాఖ చట్టం ప్రకారం, భక్తుల సౌలభ్యం కోసమే నిర్మాణాలు ఉపయోగించాలని ఆదేశిస్తూ, ఈ పిటిషన్‌పై అఫిడవిట్ దాఖలుచేయాలని హిందూ దేవాదాయ శాఖకు హైకోర్టు నోటీసు జారీచేసింది.